హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	190	220
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	215

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 20.2

ఆర్తత్రాణపరాయణుడు, ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో ఆర్జిత సేవల మొక్కులు చెల్లింపునకు భక్తులు నానాతంటాలు పడుతున్నారు. ఇష్టదైవం దర్శనాలతో పాటు మొక్కు ఆర్జితాల్లో కుటుంబసమేతంగా పాల్గొని నిర్వహిస్తే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ క్షేత్రంలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆర్జిత సేవల్లో పాల్గొనాలంటే భక్తులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఏ సేవల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక తికమక పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మొక్కు సేవలు కొండ కింద ఉండటం, తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

● యాదగిరిగుట్ట



ఉద్ఘాటనకు ముందు ఆలయ ప్రాంగణంలో సేదతీరిన భక్తులు(ఫైల్)

నారసింహా.. నీ మొక్కు చెల్లించేదెలా?

- అనాలోచిత నిర్ణయాలతో అష్టకష్టాలు
- తలానీలాల నుంచి మొక్కు టెంకాయ వరకు అంతా అసౌకర్యమే

యాదగిరికొండపైకి చేరుకున్న యాత్రికులు ముందుగా తాము మొక్కుకున్న ఆర్జిత సేవలను ఆచరించి కుటుంబసభ్యులతో కలిసి గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను దర్శించుకుంటారు. ఆ తర్వాత స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులకు, తోటి భక్తులకు పంపిణీ చేసుకోవడం ఆచారం. ఇదిలా ఉండగా ఏ వాహనంలోనైనా ముందుగా భక్తజనులు కొండపైకి చేరుకుంటారు. కాగా కొండపైకి వచ్చిన భక్తులు దేవస్థాన అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా ఆర్జిత సేవల నిర్వహణ కోసం కొండపైకి, కిందకు తిరగాల్సి వస్తుండడం భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మొక్కు టెంకాయ సమర్పణ ప్రహసనంగా మారగా మొక్కు కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హవన పూజల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక తలనీలాల సమర్పణ, వ్రతపూజలు కొండకిందకు మార్చడంతో భక్తుల ఇక్కట్లు మరింత రెట్టింపు చేస్తుండగా..ఏకంగా ఆలయ పునర్నిర్మాణం తర్వాత కొండపైన మూడు నిద్రల మొక్కు, మండల దీక్ష మొక్కులకు మంగళం పాడినట్లేనా అని భక్తులు వాపోతున్నారు.

కల్యాణోత్సవ సేవకు తప్పని తిప్పలు

ప్రధానాలయ అష్టభుజి అంతర్ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హోమం మొక్కుల నిర్వహణకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ పరిస్థితులు మారిన సందర్భంలో ఈ సేవలను ప్రధానాలయ ముఖమండపం లేదా ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు వర్షం కురిసినా, వాతావరణం మబ్బులు పట్టి చల్లగా మారితే అధికారులే తలలు పట్టుకుంటున్నారు. ఆలయ విస్తరణ సమయంలో ఏకంగా 500 మంది దంపతులు స్వామివారి నిత్యకల్యాణోత్సవం నిర్వహించుకునేలా మండపాన్ని సకల సదుపాయాలతో నిర్మిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. నిత్యకల్యాణం, హోమపూజల కోసం అష్టభుజి ఈశాన్య ప్రాకారంలో కల్యాణోత్సవ మండపాన్ని నిర్మించారు. తీరా ఉద్ఘాటన అనంతరం మాత్రం దక్షిణ దిశలో ప్రాకార మండపంలో ఈ సేవలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాకార మండపం మూడు వైపులా తెరిచి ఉండడంతో సేవలో పాల్గొనే భక్తులు వానరాలతోనే సావాసం చేయాల్సిరావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. చివరకు దేవస్థాన సిబ్బంది ప్రాకార మండపంలో ఈ సేవలు పూర్తయ్యే వరకు పహారా కాస్తుండడం విశేషం. ఇదిలా ఉండగా తాము చేసిన తప్పిదానికి దిద్దుబాటు చర్యగా ప్రస్తుతం బాలాలయం ప్రాంతంలో దాత సహకారంతో కల్యాణమండపం నిర్మాణానికి సన్నాహాలు ఆరంభించగా..ఆ పనులు ప్రణాళికలకే పరిమితమయ్యాయి.

ధ్వజస్తంభాన్ని చూసి తరించాల్సిందే

ఏ దేవాలయానికి వెళ్లినా ప్రతీ భక్తుడు తప్పనిసరిగా ధ్వజస్తంభానికి మొక్కుకుని గర్భగుడిలో కొలువుదీరిన మూలమూర్తులను దర్శించుకోవడం ఆనవాయితీ. ఆలయ విస్తరణకు ముందు కొండకు వచ్చిన ప్రతీ భక్తుడు ముఖ మండపంలోని ధ్వజస్తంభం, బలిపీఠాలకు మొక్కుతూ గర్భాలయంలోనికి వెళ్లేవారు. ఒకవేళ రద్దీ చాలా ఎక్కువగా ఉన్న సమయంలో ఆలయ బయటనుంచే కనిపించే ధ్వజస్తంభాన్ని, విమానగోపురం గల సుదర్శన చక్రానికి మొక్కుకుని మరోమారు యాత్రకు వస్తామంటూ తిరుగు ప్రయాణమయ్యేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధానాలయ ముఖమండపంలోనికి వెళ్లిన భక్తులకు మాత్రమే ధ్వజస్తంభాన్ని దర్శించుకోవాలే తప్ప దండం పెట్టుకునే అవకాశమే లేకుండా ఏర్పాట్లు ఉన్నాయి.

మొక్కు టెంకాయ సమర్పణ ఎక్కడ?

యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులకు మొక్కు టెంకాయ సమర్పణ ప్రధాన సమస్యగా మారింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు టెంకాయలు సమర్పించడం ఆచారం. అయితే విస్తరణ అనంతరం మొక్కు టెంకాయ సమర్పణ సేవను విష్ణుపుష్కరిణి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్నారు. అయితే ఈ మార్గం గుండా ధర్మదర్శనాల భక్తులు వెళుతున్న వారికి టెంకాయ మొక్కు చెల్లించుకునేందుకు నానా



ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే వీఐపీ దర్శన టికెట్ పొందిన భక్తులు, నేరుగా ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు మొక్కు టెంకాయ సమర్పణ కోసం వెతుకులాడాల్సి వస్తోంది. చివరకు గుడి పరిసరప్రాంతాల్లో కొందరు విడిచిపెట్టి వెళుతుండగా, తూర్పు రాజగోపురం ముందు టెంకాయలతో వచ్చిన భక్తుల నుంచి ఆలయంలోనికి అనుమతి లేదంటూ దేవస్థాన సిబ్బంది టెంకాయలను తీసుకుని ద్వారం వద్ద వదిలివేస్తున్నారు. దీంతో భక్తులు స్వామికి మొక్కుటెంకాయ సైతం సమర్పించుకునే భాగ్యం తమకు లేకుండా పోతుందని వాపోతున్నారు.

గుడి వద్దే టెంకాయ సమర్పణ ఉండాలి



కొండపైన గుడివద్దే మొక్కుటెంకాయలు సమర్పించుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలి. చిన్నప్పటి నుంచి కుటుంబసమేతంగా గుట్టను సందర్శిస్తున్నా, పాతగుడి, బాలాలయంలోనూ దర్శనాలనంతరం గుడి కి సమీపంలోనే కొబ్బరికాయలు కొట్టేవాళ్లం. అదే పద్ధతి కొనసాగిస్తే అందరికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం టెంకాయ కొట్టడానికి తిరిగి బస్ స్టాండ్ వద్దకు రావాల్సివస్తోంది.

- శైలజాప్రసాద్, భక్తురాలు, హైదరాబాద్

నిత్యకల్యాణ మండపం నిర్మించాలి



పూర్తిగా కృష్ణశిలలతో ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషకరమే. కానీ నిత్యకల్యాణోత్సవానికి ప్రత్యేకంగా కల్యాణమండపం నిర్మిస్తే బాగుండేది. స్వామివారి నిత్యకల్యాణోత్సవంలో ఎంతో భక్తి ప్రపత్తులు, శ్రద్ధతో కుటుంబసమేతంగా పాల్గొంటాం. ఇప్పుడున్న అష్టభుజి ప్రాకార మండపంలో ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, కోతులకు భయపడుతూ కల్యాణోత్సవంలో పాల్గొనాల్సి వస్తోంది. అధికారులు గమనించి భక్తుల సౌకర్యంతో పాటు కల్యాణమూర్తుల వద్దకు కోతులు రాకుండా సరైన సదుపాయాలతో నిత్య కల్యాణం, హోమ పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- జీపీఆర్ లక్ష్మి, భక్తురాలు, సరూర్‌నగర్

ఆర్జితాలన్నీ కొండపైనే ఉండాలి

యాదగిరికొండకు కుటుంబసమేతంగా వచ్చి ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని దర్శించుకుని వెళతాం. కొన్ని సేవలు కింద, కొన్ని సేవలు కొండపైన ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చంటిపిల్లలు, వృద్ధులతో కలిసి సేవల్లో పాల్గొనాలంటే ఇటు, అటూ తిరగడంతోనే పుణ్యకాలం పూర్తవుతోంది. సకాలంలో పూజలకు చేరుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్ని ఆర్జితాలు కొండపైనే ఉంటే ఇబ్బందులు పూర్తిగా తప్పుతాయి.

- ఎస్ మౌనిక, భక్తురాలు, రామంతాపూర్

వ్రత పూజలు కొండకిందనా?

స్వామి సన్నిధిలో సత్యనారాయణస్వామి వ్రత పూజల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగి ఉందని స్థల పురాణం చెబుతోంది. ఆలయ విస్తరణలో భాగంగా వ్రత మండపాన్ని కొండకింద మూడో ఘాట్‌రోడ్డు సమీపంలో నిర్మించారు. అయితే తమ ఇళ్ల నుంచి నేరుగా కొండపైకి చేరుకున్న భక్తులు వ్రత పూజలు చేపట్టేందుకు పిల్లాపాపలతో కొండకిందకు వెళ్లాల్సి రావడం భక్తులను ప్రయాసలకు గురిచేస్తోంది.



కొండపైన వ్రత పూజల్లో పాల్గొన్న భక్తజనులు(ఫైల్)

కలగా మూడు నిద్రల మొక్కు

స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన కొండపైనే మూడు నిద్రలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసం. అలనాడు యాదరుషి కఠోరమైన తపస్సుతో స్వామిని సాక్షాత్కారం చేసుకున్నాడని, స్వామి సన్నిధిలో మూడు నిద్రలు చేస్తే యాదరుషి పొందిన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం. గతంలో భక్తులు కుటుంబసమేతంగా కొండపైనే వసతి గదులు లభించకున్నా.. ఆలయ తిరువీధుల్లోనే నిద్రచేసి మొక్కులు చెల్లించుకునేవారు. ప్రస్తుతం కొండపైన ఎలాంటి డార్మెటరీ హాల్స్ తదితర నిర్మాణాలు లేకపోవడంతో మూడు నిద్రల మొక్కు క్షేత్రానికి వచ్చిన భక్తులకు కలగానే మారింది.



కొండపైన వసతి గదుల సముదాయం (ఫైల్)

తల నీలాల మొక్కు తీరినట్టేనా!

స్వామివారి దర్శనాలకు విచ్చేసిన భక్తులు కొండ కింద మొక్కుతలనీలాలు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో తమ మొక్కులు తీరినట్టేనా అన్న ఆందోళనలో ఉన్నారు. చేసేదేమీ లేకపోవడంతో మొక్కుబడిగా మొక్కుతలనీలాలను చెల్లించుకుంటున్నారు. మొక్కుతలనీలాలు తీసిన వెంటనే మహిమాన్విత విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించే వారమని, ఇప్పుడు కొండకింద తలనీలాలు తీసి పక్కనే ఉన్న లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు చేస్తున్నారు. మహిమాన్విత విష్ణుపుష్కరిణితో కృత్రిమంగా నిర్మాణం జరిపి లక్ష్మీపుష్కరిణిగా ఎలా పోల్చుకోగలమని భక్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



కొండపైన తలనీలాలు సమర్పిస్తున్న భక్తజనులు(ఫైల్)

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీలు : కలెక్టర్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎం యంత్రాల తొలి దశ తనిఖీ(ఎఫ్ఎల్‌సీ)లను పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ వద్ద యంత్రాల ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు సిద్ధం చేయడం కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన 4,222 బ్యాలెట్ యూనిట్లు, 22 శాతం కంట్రోల్ యూనిట్లు, 2,784 వీవీప్యాట్ యంత్రాల పనితీరును పరిశీలించామన్నారు. ఈ నెల 14వరకు పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఎన్నికల డీటీవీ విజయ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వరన్యాయం జరిగేలా పనిచేయాలి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5 : వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే సందర్భంగా 35 మంది అందించిన అర్జీలను తీసుకుని వారితో నేరుగా మాట్లాడారు. అదేవిధంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. భూసమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యలపైన ఫిర్యాదు అధికంగా అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజాసమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగంగా స్పందించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూసి ఫిర్యాదుదాడికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. ప్రతీ ఫిర్యాదునూ ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

సీఈవో ఎంపికలో నాబార్డుదే తుది నిర్ణయం

నల్లగొండ, ఫిబ్రవరి 5 : సీఈవో పోస్టు భర్తీ ఆర్‌బీఐ నిబంధనల మేరకు పూర్తిగా నాబార్డు చూసుకుంటుందని చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సోమవారం ఆయన అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. డీసీసీబీ సీఈవోగా శంకర్‌రావును నాబార్డు ఐదుగురితో కూడిన కమిటీ ఎంపిక చేయడంతో ఆ నిర్ణయాన్ని ఎంసీ మీటింగ్ ఆమోదముద్ర వేసింది. ఈ సందర్భంగా చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తమ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. సీఈవో పోస్టు భర్తీని పారదర్శకంగా నిర్వహించారన్నారు. మొత్తం 14 మంది దరఖాస్తు చేసుకోగా ఒకరు ఇంటర్వ్యూకు హాజరుకాలేదని నలుగురి దరఖాస్తులను వివిధకారణాలతో నాబార్డుతిరస్కరించిందన్నారు. మొత్తం 9మందిహాజరు కాగా అందులో సీనియర్ శంకర్‌రావును నాబార్డు ఎంపిక చేసిందన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5: గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని రహదారులు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా అధికారులు ఎన్నికలు నిర్వహించే వరకు అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నందున గ్రామపంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ట్యాంకులు, పైప్ లైన్ లీకేజీలు రిపేర్ చేయాలన్నారు. ఎమ్మెల్యేలకు కేటాయించిన నిధుల నుంచి తాగునీటి సమస్యకు పరిష్కారానికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఫిబ్రవరి 7 నుంచి 11వ తేదీ వరకు గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు తమ విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. నిధులు, నిధుల లభ్యత, ఎంత ఖర్చు చేశారు అనే విషయాలను పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీ ఇంటి పన్ను, లేఅవుట్ అనుమతులు, నాలా ట్యాక్స్ సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీకి వచ్చే ఆదాయంతో గ్రామపంచాయతీ కార్యకలాపాలు నిర్వహించాలని అన్నారు. పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకం గురించి వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీపీవో విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. సకలాంగులతో సమానంగా దివ్యాంగులకు కూడా నల్లగొండలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అవసరమైన వృత్తుల్లో శిక్షణ ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు మెడికల్ కళాశాల, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగులు ఆధైర్య పడకుండా ముందుకు సాగాలని సూచించారు. కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆ దిశగా దివ్యాంగులు ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఫలాలు అందించే విధంగా రుణ సదుపాయాలను కల్పిస్తామన్నారు. దివ్యాంగులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. సమస్య ఉన్న వారు ఎప్పుడైనా సెక్రటేరియట్‌కు వచ్చి తనను కలవవచ్చని అన్నారు. గతంలో ఆ నాలుగు కుటుంబాలే బాగుపడ్డాయని, ప్రస్తుతం తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని అన్ని రంగాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, డీఎస్పైఓ మక్బూల్ అహ్మద్, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాస్, గోగుల శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థులు రాణించాలి

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సందర్శించిన మంత్రి ప్రభుత్వ కళాశాలలో విద్యను బెదిరిస్తున్న విద్యార్థులు అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల కోమటిరెడ్డి ప్రతి కళాశాలలో ఆయన పర్యటించి విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే చర్చించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా విద్యను భరించాలని ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 5 : అసెంబ్లీ ఎన్నికల లోపాలను సవరించుకుని పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కాంగ్రెస్ నేతలు నెపం కేసీఆర్‌పైకి నెడుతున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధిపైనే కేసీఆ ర్ దృష్టి సారించారే తప్ప పార్టీ నిర్మాణంపై శ్రద్ధ వ హించలేదన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చినప్పటికీ చేసి న మంచిని ప్రచారం చేయలేకపోయామన్నారు. మా జీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ అన్నిగ్రామాల కు రోడ్లు, మంచినీరు లాంటి మౌలిక సౌకర్యాలు కేసీఆర్ ప్రభుత్వమే కల్పించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో ఉన్న భ్రమలు తొలగుతున్నాయన్నారు. సర్పంచ్‌లకు, ఎంపిటీసీలకు, ఎంపీపీలకు ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం నాగార్జునసాగర్‌ప్రాజెక్టును కేంద్ర బోర్డుకు అప్పగించినందుకు నిరసనగా నందిపాడు జంక్షన్‌వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను కార్యకర్తలు దహనం చేశారు. సమావేశం లో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, మునిసిపల్ చైర్మన్ తి రునగరు భార్గవ్, రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ యువజన నాయకులు నల్లమో తు సిద్దార్థ, అన్నభీమోజు నాగార్జునాచారి, నారాయణరె డ్డి, సంపత్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పా ల్గొన్నారు. కార్యకర్తలు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక నేతలు కార్యకర్తలను దరికి రానివ్వలేదన్నారు. ఉద్యమకారులకు, పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మార్చి ఉద్యమస్ఫూర్తి లేకుండా చేశారని ఆరోపించారు.



బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

పంటలకు జీవం

- మేజర్లకు కొనసాగుతున్న నీటి విడుదల
- ఊపిరి పోసుకుంటున్న ఎండుతున్న పొలాలు
- రైతుల్లో చిగురించిన ఆశలు



● 7లో..

అక్రమ కట్టడాల కూల్చివేత

- నివాసగృహాలు, గెస్ట్‌హౌస్‌లపై కొరడా
- చర్యలు చేపట్టిన అధికారులు



● 7లో..

యాదగిరిగుట్టలో హరిహరులకు విశేష పూజలు



శివాలయంలో స్ఫటికమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వయంభూ లక్ష్మీనారసింహుడికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో లక్ష్మీనృసింహుడిని మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలోని మూలమూర్తులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు విశ్వక్సేనుడికి తొలి పూజలతో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల సహస్రనామ పఠనాలతో బిల్వపత్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.34,02,176 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

ఆధార్, రేషన్‌కార్డు అనుసంధానం చేయించుకోవాలి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలులో భాగంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ల నంబర్లను గృహ విద్యుత్ సర్వీస్ నంబర్‌కు జత చేయవలసి ఉంటుందని చౌటుప్పల్ మండల ట్రాన్స్‌కో ఏఈ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విద్యుత్ సరఫరా బిల్లింగ్ కోసం ఇళ్ల వద్దకు వచ్చే ఆపరేటర్‌లు, లైన్‌మన్‌లకు ఆధార్ కార్డు, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలను అందజేసి, సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎంపీపీ కవితకు మరో షోకాజ్ నోటీస్?

కోదాడ రూరల్, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీపీ కవితకు కలెక్టర్ వెంకటరావు మరో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. కోదాడ ఎంపీపీగా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో మండల పరిషత్‌కు సంబంధించిన రూ.40లక్షలు దుర్వినియోగం చేశారని ఎంపీటీసీలు, జడ్పీటీసీ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన కవితకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ నోటీస్‌కు కవిత స్పందించకపోవడంతో తిరిగి మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం మరో నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.

నిందితుడికి ఆరు నెలల జైలు

కట్టంగూరు, ఫిబ్రవరి 5: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నకిరేకల్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు కట్టంగూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసుకు సంబంధించి ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... 2015మే 20వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో మండలంలోని పరడ గ్రామానికి చెంది మాగి భిక్షం, కోనేటి యాదయ్య, సుంకరబోయిన వెంకన్న ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం నుంచి కట్టంగూర్‌కు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో పావన గుండ్ల సబ్‌స్టేషన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఏపీ 10 ఏక్యూ 8912 నెంబర్ గల కారు అతివేగంగా, అతిజాగ్రత్తగా ముందుగా వెళ్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న మాగి భిక్షం, కోనేటి యాదయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సుంకరబోయిన వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. భిక్షం కుమారుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ విజయ్ ప్రకాష్ కేసు నమోదు చేసి చార్జీషీటు ఫైల్ చేశారు. సోమవారం రోజు నకిరేకల్ మెజిస్ట్రేట్ విచారణ జరిపి నేరం రుజువైనందున కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానందకు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధించినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం



విఠలాచార్యను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రామన్నపేట, ఫిబ్రవరి 5: పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కూరెళ్ల విఠలాచార్యను చౌటుప్పల్ మండల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్నాటి శంకరయ్య, కానుగుల వెంకటయ్య, భీమిడి మోహన్‌రెడ్డి, ముటుకుల్లోజు పాండురంగాచారి, సహాధ్యక్షుడు చొల్లేటి రాజయ్య ఉన్నారు.

చికిత్సపొందుతూ కార్మికుడు మృతి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: చికిత్సపొందుతూ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన రాంజీ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని బోరబండలో ఉంటు న్నాడు. భువనగిరి శివారులోని పగిడిపల్లి పరిధిలో సికింద్రాబాద్‌లోని మాణెపల్లి జువ్వెలర్స్ ఆధ్వర్యంలో బాలాజీ టెంపుల్ నిర్మిస్తున్నారు. ఆ టెంపుల్‌లో ఫ్లోరింగ్ వేసేందుకు రాంజీ అనే కూలీ జనవరి 26న కొలతలు తీస్తుండగా లిఫ్ట్ కోసం తీసిన గుంతలో జారి పడడంతో గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు.

పంటలకు జీవం



ఆయకట్టులో సాగు చేసిన పొలాలు

- మేజర్లకు కొనసాగుతున్న నీటి విడుదల
- ఊపిరి పోసుకుంటున్న ఎండుతున్న పొలాలు
- రైతుల్లో చిగురించిన ఆశలు



కొనసాగుతున్న నీటి విడుదల

నిడమనూరు, ఫిబ్రవరి 5: నిడమనూరు మండలం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మేజర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రధానకాల్వకు నీటి విడుదల కొనసాగుతున్నందున మేజర్ కాల్వలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నందున రైతుల విజ్ఞప్తి మేరకు ముదిమాణిక్యం, నారెళ్ల గూడెం మేజర్లకు ఆదివారం ఉదయం నుంచి ఎన్నెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో అనేక మంది రైతులు యాసంగిలో పంటలు సాగు చేశారు. నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కొందరు బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నందున అనేక చోట్ల పొలాలు నెర్రెలు బారి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొలాలు కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపేందుకు ప్రభుత్వం సాగర్ ప్రధానకాల్వకు ఇటీవల నీటిని విడుదల చేశారు. ఆయకట్టులో సాగు చేసిన పొలాలు తమ కళ్ల ముందే ఎండిపోతున్నా, పక్క జిల్లాలోని రిజర్వాయర్ నింపేందుకు మాత్రం నీటిని విడుదల చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో తమ పంటలు కాపాడుకునేందుకు నిడమనూరు, అడవిదేవులపల్లి, దామరచర్ల, త్రిపురారం మండలాలకు చెందిన పలువురు రైతులు ఇటీవల ముదిమాణిక్యం మేజర్ వద్ద నీటిని విడుదల చేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ మేజర్లకు నీటి విడుదలకు అనుమతి లేదని అధికారులు రైతులను అడ్డుకున్నారు. రాత్రి సమయంలో రైతులు మేజర్ షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేస్తారనే భయంతో అధికారులు, పోలీసులు మేజర్ వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో రైతులు ఎండుతున్న పొలాల గురించి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పంటల పరిస్థితి వివరించారు. దాంతో వారు ఎన్నెస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడి మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేసే విధంగా ఆదేశాలు ఇప్పించడంతో నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ముదిమాణిక్యం మేజర్‌కు 400 క్యూసెక్కులు, నారెళ్ల గూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా మేజర్లకు ఎన్ని రోజులు నీటిని విడుదల చేస్తారనేది సరైన ఆదేశాలు రాలేదు. ప్రజా ప్రతినిధుల చొరవతో మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండిపోతున్న పొలాలకు జీవం పోసినట్లయిందని రైతులు భావిస్తున్నారు. ప్రధానకాల్వకు మరో మూడు రోజులపాటు నీటి విడుదల కొనసాగనుంది. దీంతో మేజర్లకు సైతం నీటిని విడుదల చేసే అవకాశం ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే జైవీర్ చొరవ వల్లే సాగు నీరు

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చొరవ తీసుకోవ డం వల్లే మేజర్లకు సాగునీరు విడుదల అవుతోంది. ఆయకట్టులో యాసంగిలో సాగు చేసిన పొలాలు ఎం డిపోతున్నందున తమ పరిస్థితి ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి కాల్వలకు నీటిని విడుదల చేయించారు. నీటి విడుదల తో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- గడ్డం గోవిందరెడ్డి, రైతు, నారమ్మగూడెం

నారెళ్లగూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీరు

నారెళ్లగూడెం మేజర్ కాల్వ డిజైన్ డిశ్చార్జి ప్రకారం 80క్యూసెక్కులకు ప్రస్తుతం కాల్వకు 70క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ఎన్ని రోజులపాటు నీటిని విడుదల చేసే విషయం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఉంటుంది. ప్రస్తుతానికి అయితే నీటి విడుదల కొనసాగుతుంది.

- ప్రవీణ్‌రాజు, ఏఈ

అనంతారంలో వ్యక్తి సజీవ దహనం

- హత్యా..? ఆత్మహత్యా..? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- ద్విచక్రవాహనం సహా దహనమైన వ్యక్తి
- బైక్ నెంబర్ ఆధారంగా బంధువులకు సమాచారం
- యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన



నాగరాజు (ఫైల్)

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి సమీపంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద దారుణం జరిగింది. ద్విచక్ర వాహనం సహా ఓ వ్యక్తి సోమవారం దహన మై కన్పించాడు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి అతనిని హత్య చేసి ఉంటారని అను మానాలు వ్యక్తమవుతున్నాయి. బైక్ నుంచి మంటలు వస్తుండ డంతో గమనించిన స్థానికులు వెంటనే భువనగిరి రూరల్ పోలీసులకు సమాచార మిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన ప్రాంతంలో లభించిన సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా అతని ఆచూకీని కనుగొని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) తండ్రి పోచం 25సంవత్సరాల క్రితం మృతిచెందాడు. తల్లి లక్ష్మీ కూడా 16సంవత్సరాల క్రితం మృతిచెందింది. నాగరాజుకు సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో 15 సంవత్సరాల క్రితం కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌లోని ఫిలింనగర్ సమీప ంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అవివాహితుడైన నాగరాజు చిన్నప్పటి నుంచి మధుమేహం వ్యాధితో బాధపడు తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన నాగరాజు అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద సజీవ దహనమైన స్థితిలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు నాగరాజు తాను వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బైక్ మీద కూర్చొని ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల గూడూరు టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించగా బైక్‌పై అతడు ఒక్కడే వచ్చినట్లు రికార్డు అయిందని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ ఘటనా స్థలంలో క్లూస్ టీం క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజుకు వరుసకు సోదరుడైన రిటైర్డ్ తహసీల్దార్ ముల్కల సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో కృష్ణవేణికి గోల్డ్ మెడల్



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 5: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా జట్టుకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ మాట్లాడుతూ కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన కబడ్డీ రాష్ట్ర కమిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్, నామా నర్సింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

- నివాసగృహాలు, గెస్ట్‌హౌస్‌లపై కొరడా
- చర్యలు చేపట్టిన అధికారులు



సాగర్ హిల్‌కాలనీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 5: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో కృష్ణానది తీరంలో అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. కృష్ణానది తీరంలో సామాన్య ప్రజలతో పాటు బీఆర్ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించి, నివాసగృహాలు, అతిథిగృహాలు నిర్మించుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన మునిసిపల్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నారు. తాజాగా సోమవారం హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహం వెనక వైపున నదీతీరంలో నిర్మించుకున్న ఓ బీఆర్ఎస్ నాయకుడి గెస్ట్‌హౌజ్‌ను మునిసిపల్ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేశారు. అలాగే ఫైలాన్‌కాలనీలో ఓ ప్రైవేట్ ఉద్యోగి నిర్మించుకున్న అక్రమ కట్టడాన్ని కూడా నేలమట్టం చేశారు. ఈ అక్రమకట్టడాలు అన్ని టీఎస్ బీపాస్ మునిసిపల్ యాక్ట్ 2019 ప్రకారం కూల్చివేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వీ రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని క మిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్, ఇన్‌చార్జి కమిషనర్ వీరారెడ్డి, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేశారు

విజయవిహార్ వెనక వైపున ఉన్న స్థలంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకున్న నివాసగృహాన్ని జీవో నంబర్ 59 ప్రకారం దరఖాస్తు కూడా చేసుకున్నాం. మునిసిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మరో రెండు రోజుల్లో గృహప్రవేశం ఉండగా కూల్చివేయడం ఎంతవరకు సమంజసం.

- ఆవుదొడ్డి కార్తీక్, బాధితుడు

భూ సమస్య పరిష్కారం కావడంలేదని మనస్తాపం

- ఆత్మహత్య చేసుకుందామని పురుగుమందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చిన మహిళ
- సూర్యాపేట కలెక్టరేట్‌లో ఘటన

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: తన కుటుంబ సభ్యుల వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేయనందుకు ఆమె మనస్తాపం చెందింది. ఆత్మహత్య చేసుకోవాలని పురుగు మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని ఆమెను కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లారు. బాధితురాలు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తండ్రి సుంకిరెడ్డి నారాయణరెడ్డి పదేళ్ల క్రితం మరణించాడు. నారాయణరెడ్డి పేరిట చివ్వెంల రెవెన్యూ శివారులో పలు సర్వే నెంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని తల్లి సుశీలమ్మ పేరున మ్యూటేషన్ చేయాలని ఏడాది క్రితం మీసేవా ద్వారా పూలమ్మ దరఖాస్తు చేసింది. కాగా ఆన్‌లైన్‌లో సంబంధిత భూమి నెంబర్లకు డేటా కనెక్షన్ లింక్ అయింది. దానిని తొలగించి మ్యూటేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పూలమ్మ ఆరోపించింది. తల్లి సుశీలమ్మకు వయస్సు పైబడుతున్నందున చేసేదిలేక, కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. పురుగు మందు డబ్బా తీసుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పూలమ్మ సంచిని తనిఖీ చేయగా పురుగు మందు డబ్బా కనిపించింది. వెంటనే ఆమె వద్ద ఉన్న పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని పూలమ్మను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్ సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



పూలమ్మ నుంచి పురుగుమందు డబ్బా స్వాధీనం చేసుకున్న భద్రతా సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు విద్యార్థుల పోస్టుకార్డు



పోస్టుకార్డులు చూపుతున్న విద్యార్థులు

తిప్పర్తి, ఫిబ్రవరి 5 : తమ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం పోస్టు కార్డులు రాశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని మామిడాల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, నాలుగు ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయులు లేక చదువుల్లో వెనుకబడుతున్నామని పేర్కొన్నారు. పాఠశాలలో బాలికల మూత్రశాలలకు పై కప్పులేని ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఈ సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి విద్యార్థులు సీఎంకు లేఖ రాడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

వలిగొండ, ఫిబ్రవరి 5: మద్యానికి బానిసై ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన పసల సతీష్‌కుమార్(24) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానివేయాలని కుటుంబసభ్యులు ఎంత చెప్పినా అతనిలో మార్పు కనబడలేదు. ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. సోమవారం ఉదయం సతీష్‌కుమార్ తండ్రి బాలస్వామి పొలానికి వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కుమార్‌కు భార్య భాగ్యరేఖ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5: బైక్, తుఫాన్ ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో చోటుచేసుకుంది. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై కొలనుపాకకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఆలేరు నుంచి సిద్దిపేటకు వెళ్లే రహదారిలో ఆశ్రమం వద్దకు వస్తుండగా ఆలేరు నుంచి కొలనుపాక వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని ఆలేరులోని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, ఫిబ్రవరి 5: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సాధు చంద్రశేఖర్‌రెడ్డి(23) హైదరాబాద్‌లో వాటర్ వాషింగ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆదివారం స్వగ్రామం కాంచనపల్లికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి అదే రోజు రాత్రి టీఎస్ 30 హెచ్ 4040 నెంబర్ గల ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గూడూరు టోల్‌ప్లాజా వద్ద టీఎస్ 05యూడీ 4546 నెంబర్ గల లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి పైనుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సాధు విక్రమ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌గౌడ్ తెలిపారు.

బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జైలు

సూర్యాపేటలీగల్, ఫిబ్రవరి 5: బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ జి. రాజగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మాలోతు నాగేశ్వర్‌రావు కుమారుడు ఉపేందర్ 2016 అగస్టు ఏడో తేదీన కోదాడలో హేర్ కటింగ్ చేయించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా, అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మిర్యాలగూడెం నుంచి కోదాడకు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడిక్కడే మరణించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కోదాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ.శ్రీదేవి 2019 డిసెంబరు నాలుగో తేదీన నిందితుడూన జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన అద్దంకి చినబాబుకు ఒక సంవత్సరం జైలు, రూ.1000జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తీర్పును సమర్థిస్తూ జిల్లా కోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

అంగన్‌వాడీలో కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలు

అనంతగిరి, ఫిబ్రవరి 5: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుక్కర్ పేలి ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది సోమవారం పప్పు వండుతుండగా కుక్కర్ హఠాత్తుగా పేలింది. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో 15మంది చిన్నారులు ఉండగా, నీలం అభినవ్, కరిశ తన్వీకి గాయాలయ్యాయి. తహసీల్దార్ రవికుమార్, అంగన్‌వాడీకేంద్రానికి వచ్చి చిన్నారులను కోదాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. శాంతినగర్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఒక కేంద్రంలో టీచర్ తన వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ కేంద్రాన్ని మరో అంగన్‌వాడీ కేంద్రంలో కలిపి నిర్వహిస్తున్నారు.

సాహిత్యంలో పరిశోధనలు విస్తృతం కావాలి

నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 5: సాహిత్యంలో పరిశోధనలు విస్తృతం కావాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ కృష్ణ కౌండిన్య, కవి, రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో సృజన సాహితీ, ఉనికి సామాజిక సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశోధనల్లో లోతైన అంశాలను ముందుతరాలకు అందించడానికి వీలవుతుందన్నారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్న సాహితీవేత్త సాగర్ల సత్తయ్యను ఘనంగా సన్మానించారు. పెరమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహితీవేత్తలు, కవులు, రచయితలు మునాస వెంకట్, మల్లిఖార్జున్, మండల స్వామి, నర్సింహ, మాదగాని శంకరయ్య, గోవర్ధన్, శంకరయ్య, నర్సిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ చట్టాలను గౌరవించాలి

హాలియా, ఫిబ్రవరి 5: ప్రతీ పౌరుడు రాజ్యాంగ చట్టాలను గౌరవించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. హాలియాలోని ప్ర భుత్వ డిగ్రీ కళాశాల లో సోమవారం కేరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో 'రాజ్యాగ పరిపాలన - ఓటింగ్ హక్కులు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వినియోగించుకోవాలని, రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ హక్కులను పొందాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ యాదయ్య, ప్రోగ్రాం కన్వీనర్ మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కవియాత్ర కరపత్రం ఆవిష్కరణ

హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కవియాత్ర కరపత్రాన్ని సోమవారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గేయ రచయిత గాయకులు శ్రీకళ రాంమూర్తి, సిరివేరు సాహితీ కళాపీఠం అధ్యక్షులు లింగమూర్తి, రాజనీతి శాస్త్రం అధ్యాపకులు శ్రీరామ్ మోజు, హరికృష్ణ, కామర్స్ లెక్చరర్ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, జనవరి 5: చేనేత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో చేనేతరంగానికి రూ. 1200 కోట్లు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతరంగం సుదీర్ఘకాలంగా సంక్షోభంతో పోరాడుతుందని అన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్ర భుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్ర పెంచి నగదు బదిలీ ఇవ్వాలన్నారు. చేనేత సహకార సంఘాల్లో, మరియు కార్మికుల దగ్గర నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్, ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీరంగం, రాపోలు వెంకన్న, వాలుగొండ మధు, గడ్డం దశరథ, గంజి నాగరాజు, రాపోలు వెంకటేశం, రుద్ర మారుకొండయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 5: స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ప్రముఖ కార్టూనిస్టు, ప్రధానోపాధ్యాయుడు వడ్డేపల్లి వెంకటేష్ అన్నారు. మన మిర్యాలగూడ సామాజిక సంస్థ ప్రతినిధులు పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. అన్నారం ప్రాథమిక పాఠశాలలో మన్నెం శ్రీధర్‌రెడ్డి ఎల్ఈడీ టీవీ ఏర్పాటు చేయగా రావిరాల నాగేందర్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బిర్యానీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శైలజ, సుశీల, గురువయ్య, సైదులు, ఇందిర, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉన్న నర్సరీని తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

నిడమనూరు, ఫిబ్రవరి 5: మండలంలోని బంకాపురం పాఠశాల ఆవరణలో విద్యార్థుల క్రీడలకు ఇబ్బందిగా ఉన్నందున నర్సరీని తొలగించాలని అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ అధికారులను కోరారు. సోమవారం గ్రామ యువత ఆయన ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఎంఈవో, ఏపీవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న నర్సరీ అసౌకర్యంగా ఉన్నందున విద్యార్థులతో పాటు యువత క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీ కోసం బోరు సౌకర్యం ఉన్న తన సొంత భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఉన్నం చినవెంకటేశ్వర్లు, నాయకులు మల్లికార్జున్, సత్యనారాయణ, చిన సైదయ్య, భాస్కర్, యాదయ్య, బొంగరాల శ్రీనివా స్, కుమార్, రాంబాబు, లింగయ్య, బండి శ్రీను, మూర్తి, నాగేందర్, శేషు, సాయివంశీ, కోటి, నాగరాజు, మధు, కృష్ణ, కోటేష్, ఇంద్రయ్య, అజయ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఐఈవోను సస్పెండ్ చేయాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 5: జిల్లాలో ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు బలహీనపడుతున్నాయని ఇందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఐఈవోను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు.

బీజేపీ బస్తీ చలో అభియాన్ విజయవంతం చేయాలి

మునుగోడు, ఫిబ్రవరి 5: మునుగోడులో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే బీజేపీ 'గామ్ చలో- బస్తీ చలో అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మీడియా సెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్టల శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించి పదేళ్లలో పీఎం మోదీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారం బాధ్యతగా చేయాలన్నారు.

కులగణనపై కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తాం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మర్రిగూడ, ఫిబ్రవరి 5: తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని రాష్ట్ర కేబినెట్‌లో విధానపరమైన నిర్ణయాన్ని ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై తీసుకున్న నిర్ణయం భారతదేశంలోనే చరిత్రాత్మకమైనదని, ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల్లో బీసీ కులగణన చేపట్టినట్లు తెలిపారు. మూడో రాష్ట్రంగా తెలంగాణ అవతరించనున్నట్లు తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయం, విద్యారంగంలో రిజర్వేషన్లు లేక పోవడం వల్ల రాష్ట్రంలో బీసీలు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ సమాజం తరపున సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రిజర్వేషన్ కోల్పోవడం వల్ల 70 సంవత్సరాలుగా బీసీలకు న్యాయబద్ధంగా అందాల్సిన ఫలాలు అందక బీసీలు అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు ముత్యాలుగౌడ్, పందుల రాములుగౌడ్, పగడాల లింగయ్య, కొలుకులపల్లి యాదయ్య, పగడాల యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య పలువురు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలన్నీ రద్దు చేయాలి



మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నిరుద్యోగులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 5: టీఎస్‌పీఎస్సీ గత బోర్డు నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు చేయాలని నిరుద్యోగులు కోరారు. జిల్లాకేంద్రంలో సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గ్రంథాలయం నుంచి వచ్చిన నిరుద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రితో నిరుద్యోగులు మాట్లాడుతూ పేపర్ లీకేజీ తర్వాత నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షలు అన్నింటినీ రద్దు చేయాలని, అమ్ముకున్న పోస్టులకు ఫలితాలు ఇవ్వడం ఏమిటని వారు పేర్కొన్నారు. గ్రూప్-1 పోస్టులు పెంచాలని, గ్రూ ప్-2, గ్రూప్-3 తేదీలు ప్రకటించాలని, వెంటనే జాబ్ క్యాలెండరు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20వేల టీచర్ పోస్టులను, అదేవిధంగా పీఈటీ, పీడీ పోస్టులను భర్తీ చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తిష్ట వేసిన సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రంథాలయాన్ని వెంటనే సందర్శించాలని నిరుద్యోగుల జేఏసీ కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీలం వెంకన్న, జేఏసీ నాయకులు జానయ్య, హరీష్, శ్రవణ్, సత్యం, చందు, రామకృష్ణ, నాగరాజు, ప్రవీణ్, అంజలి, మమత, సంతోష, నీలిమ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిన కేంద్రం



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలకొండ కాంతయ్య

డిండి, ఫిబ్రవరి 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించి సంక్షోభంలోకి నెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలకొండ కాంతయ్య అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 5వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులతో తెలంగాణ రాష్ట్రం ప్రధానపాత్ర పోషిస్తున్నా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి తినేందుకు తిండిలేదని ఆయన విమర్శించారు. విద్య, వైద్యం, కనీస అవసరాలకు నోచుకోక దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతిమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు నిర్వహించిన పాత్ర మహోజ్వలమైనదని, భూమి కోసం, భుక్తి కోసం సామాజిక న్యాయం కోసం పేదలు కనీస వేతనాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ సర్పంచులు విజేందర్‌రెడ్డి, మంజులశైలేజ్, వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు మణెమ్మ, హుస్సేన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి నర్సింహ, బుచ్చిరెడ్డి, షైనుద్దీన్, కనకచారి, శైలేజ్, సోమిడి శ్రీనయ్య, హుస్సేన్, వెంగలయ్య, నూనె వెంకటేశ్వర్లు, బారింగు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు సహకరించాలి

● మండల పరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి, పాల్గొన్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల పరిషత్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్యక్రమాలపై జరిగే స్పెషల్‌డ్రైవ్‌ను విజయవంతం చేయాలని అన్నారు. వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిషన్‌భగీరథతో పాటు స్థానికంగా గల నీటి వనరులను వినియోగించుకుని నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి మాట్లాడుతూ మూడెకరాల వరకు రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. త్వరలో అందరూ రైతులకు రైతుబంధు ఖాతాల్లో పడనున్నట్లు పేర్కొన్నారు. మండల విద్యాధికారి తరి రాము మాట్లాడుతూ మన ఊరి మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించిన ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తున్నామని అన్నారు. సమావేశంలో సర్పంచులు లేకపోవడంతో అధికారుల నివేదికలకే సమావేశం పరిమితమైంది. ఆయా శాఖలపై ప్రశ్నలు అడిగే వారే కరువయ్యారు.

సర్పంచులకు సన్మానం

పదవీ కాలం ముగిసిన సర్పంచులను మండల పరిషత్ ఆధ్వర్యంలో శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాజీ సర్పంచులు గ్రామాభివృద్ధిలో అధికారులకు సహకరించాలని అన్నారు. సర్పంచులు మండలాన్ని ప్రగతిపథంలో నడిపించడంతో ఎంతో కృషి చేశారని, త మ స్వంత డబ్బులు కూడా ఖర్చు చేసి గ్రామాల అభివృద్ధి తమ బాధ్యతగా భావించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఎంపీటీసీ కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సదస్సును విజయవంతం చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 5: నల్లగొండలో ఈనెల 10, 11న జరగనున్న ఎస్ఎఫ్ఐ మహిళ విభాగం సదస్సును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు నేనావత్ ఉమ కోరారు. దేవరకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సదస్సు పోస్టర్‌ను ఆమె విడుదల చేసి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో విద్యార్థినులు, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, రక్షణలేకుండా పోయిందన్నారు. కేంద్రప్రభుత్వం బలమైన చట్టాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని పేర్కొన్నారు. మహిళా సదస్సును విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్, సరస్వతి, అనిత, అఖిల, సుప్రియ, శ్రావణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీఐ జోక్యంతో ఆందోళన విరమణ

మర్రిగూడ, ఫిబ్రవరి 5: మృతుడు పగిళ్ల వెంకటేష్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేస్తున్న ధర్నా సీఐ నవీన్‌కుమార్ జో క్యంతో సోమవారం తెల్లవారుజామున విరమించుకున్నారు. ఇటీవల రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన పగిళ్ల వెంకటేష్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అయితే వెంకటేష్ మృతికి కొట్టాల గ్రామానికి చెందిన బుర్ర రాజు కారణమని ఆదివారం సాయంత్రం నిందితుని ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. రాత్రి 12 గంటల వరకు నిందితుని ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న నాంపల్లి సీఐ నవీన్ కుమార్ జోక్యం చేసుకుని ఇరు గ్రామాల పెద్దలు చర్చించి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. దీంతో ఇరువురు చర్చించుకుని న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకోవడంతో సోమవారం తెల్లవారుజామున వెంకటేష్ కుటుంబసభ్యులు ధర్నా విరమించారు. ధర్నాలో గ్రామస్థులు లపంగి నర్సింహ, రేవంత్, అంజయ్య, యాదయ్య, బండి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను అన్ని విధాలుగా ఆదుకుంటానని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ వెంకటేష్ గ్రామానికి వచ్చి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో వారి పరిస్థితి ఆందోళనకరంగా మారే పరిస్థితి ఉన్నందున మానవత్వంతో ఆ చిన్నారులకు నేను ఉన్నానని వారి విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలు గా సహాయం చేస్తానని వెల్లడించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి

నార్కట్‌పల్లి, నకిరేకల్, ఫిబ్రవరి 5: జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి వారం రోజుల పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై నల్లగొండ ఆర్డీవో రవి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిలతో పాటు సంబంధిత అధికారులతో సోమవారం చెర్వుగట్టులోని ఆలయ ఈవో కార్యాలయ ప్రాగణంలో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎండోమెంట్ ఏసీ మహేందర్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో యాదగిరి, ఈవో నవీన్‌కుమార్, కృష్ణయ్య, నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

● తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తా

నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు పద్మానగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. పద్మానగర్‌కు చెందిన కాలనీ వాసులతో సోమవారం ఆయన తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. 24 గంటల్లో బోరు వేసి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కమిషనర్‌ను ఆదేశించారు. నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పాండు రంగారావు ఫౌండేషన్ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు కొండ శ్రీను, గాజుల సుకన్య, గడ్డం స్వామి, హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ సీఐగా కొండల్‌రెడ్డి



సీఐ కొండల్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 5: పట్టణ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొండల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పీఎన్‌డీ ప్రసాద్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కాగా కొండల్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో సీఐగా పనిచేశారు. ప్రస్తుతం నల్లగొండ మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ మండల, టూటౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

ప్రజలు పరిశుభ్రత పాటించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణకుమారి



గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

కొండమల్లేపల్లి, ఫి బ్రవరి 5: ప్రజలు ఆరోగ్య సంరక్షణ కోసం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణకుమారి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొర్రోనితండాలో కొండమల్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ శిబిరంలో ఆమె పాల్గొని ప్రజలు పలు సూచనలు చే శారు. దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని, జ్వరం, వ్యాధులు సోకితే ఆస్పత్రిలో చూయించుకోవాలని సూచించారు. తండావాసులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 20 మందికి రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మరో రెండురోజుల పాటు మెడికల్ శిబిరం కొనసాగనున్నట్లు మెడికల్ ఆఫీసర్ ఉషారాణి పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఏఎన్ఎం ఇసాక్, ఆశా వర్కర్లు జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్లు, మాజీ సర్పంచ్ కొర్ర లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలను పొడిగించాలి

వేములపల్లి, ఫిబ్రవరి 5: సాగర్ ఎడమకాల్వ నీటి విడుదలను మరో పది రోజుల పాటు పొడిగించి పంటలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని సాగర్ ఆయకట్టు కింద ఎండిపోతున్న పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. యాసంగి సీజన్ ప్రారంభంలో బోరుబావుల్లో జలాలు పుష్కలంగా ఉండటంతో వరి పంటల సాగు చేపట్టారని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటాయని అన్నారు. పొట్ట దశలో చేతికందే పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ప్రస్తుత నీటి విడుదలతో చివరి ఆయకట్టుకు నీరు చేరే పరిస్థితి లేనందున మరో పది రోజుల పాటు నీటిని విడుదల చేస్తే పంట బోరుబావుల ఆధారంగా వేసిన పంట చేతికందుతాయని అన్నారు. పరిసర గ్రామాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీరతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెగాని సైదులు, వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వట్టికోట ఆళ్వారుకు ఘన నివాళి

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 5: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వట్టికోట ఆళ్వారు స్వామి వర్థంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు, కవులు, రచయితలు మేరెడ్డి యాదగిరిరెడ్డి, పున్న అంజయ్య, కట్టనాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చిట్యాల: చిట్యాల మండల పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపోలు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ లతీఫ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఇమామ్‌కరీం ఎన్నికయ్యారు.

నార్కట్‌పల్లి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొరివి శంకర్ పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్‌రావు, గణేష్, శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, నర్సింహ, తిరుమలేష్, సతీష్, లింగస్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని భీమనపల్లి మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి సహకారంతో అందించినట్లు వంటి పదో తరగతి స్టడీ మెటీరియల్స్‌ను భీమనపల్లి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేశారు. పదిలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ఆకాంక్షించారు.

తిరుమలగిరి(సాగర్): కవి అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ అనే పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించడంపై పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు పరమేష్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పాట ప్రతి ఒక్కరిని కదలించిందన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మజీద్ కమిటీ వినతిపత్రం అందజేసింది. స్థానికంగా ఈద్గా మినార్ నిర్మాణానికి రూ.50వేల విరాళాన్ని తన వంతుగా మంత్రి మజీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్‌కి అందజేశారు.

చిట్యాల: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని వైద్యులు గాయత్రి, శ్రీనివాస్ సూచించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిట్యాల జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి ఐరన్ మాత్రలు అందజేశారు.

అడవిదేవులపల్లి: ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న మండలంలోని జీలకురకుంటండా సర్పంచ్ కుర్ర పకీరానాయక్‌ను మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావును మిర్యాలగూడ పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లలో గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు ఆయన తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: ప్లాస్టిక్ నిషేధంపై నిర్లక్ష్యం తగదని తెలంగాణ యువజన సంఘ పట్టణ అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధించామని పురపాలకులు ప్రచారం చేస్తున్నా పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతుందని అన్నారు.

నకిరేకల్: భువనగిరి పార్లమెంట్ అభివృద్ధిపై మంగళవారం నకిరేకల్‌లో నిర్వహించే విజన్‌చర్చను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగిలయ్య, మండల వెంకన్న కోరారు. బీజేపీ భువనగిరి పార్లమెంట్ నాయకుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించే చర్చా వేదికలో రాజకీయాలకతీతంగా జరుగుతున్న విజన్ చర్చలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

తిప్పర్తి: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బీమగాని గణేష్ కోరారు. గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజన, ఆశా, హమాలీ కార్మికులందరితో కలిసి ఆయా శాఖల అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు.

హాలియా: ఏకపక్షంగా చేసిన రాష్ట్ర గీత ప్రకటనను పునరాలోచన చేసి రాష్ట్ర అవతరణకు ముందున్న గీతాల ప్రాతిపాదికన రాష్ట్ర గీతాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గీత రచయితల్లో ఒకరైన కవి, వాగ్గేయకారులు శ్రీకళ రాంమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర గీతాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా ఏకపక్షంగా ఏర్పాటు చేస్తే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

దేవరకొండ: కళాకారులకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని దేవరకొండ ఎస్‌బీఐ ఏజీఎం సన్యాసిరాజు, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీలు అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయంలో సింగర్ రామును ఘనంగా సన్మానించారు.

నల్లగొండటౌన్: బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన సికలంబట్ల భజరంగ్ ప్రసాద్ నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు నియామకపత్రాన్ని అందజేశారు. భజరంగ్‌ప్రసాద్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రామగిరి: భువనగిరి అసెంబ్లీ ప్రభారిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతేపాక సాంబయ్యను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పోతేపాక మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

పెద్దవూర: ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైతసిద్ధాంత, వేమన పద్యాల అనుబంధ గ్రంథాలను మండలంలోని ఈదులగూడెంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెద్దవూర: ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న మండలంలోని పర్వేదుల గ్రామపంచాయతీ సర్పంచ్ దండ మనోహర్‌రెడ్డితో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సోమవారం గ్రామస్థులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచ్ మనోహర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

నకిరేకల్: ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురియకపోవడంతో బోరుబావులు ఎండిపోయి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాళ ప్రమీల, సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని మంగళపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి పొలాలను వారు పరిశీలించారు. గ్రామంలో సుమారు 150 ఎకరాల వరకు ఎండిపోయిందని ఆయా రైతులను ఆదుకోవాలని కోరారు.